క్లుప్తంగా

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



ఎమ్మెల్యే చిట్టిబాబును సత్కరిస్తున్న వాకలగరువు గ్రామ కమిటీ సభ్యులు

అంబాజీపేట: నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులంతా గ్రామంలోని నాయకులను, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ వైఎస్సార్‌ సీపీ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. నూతనంగా ఎన్నికైన వాకలగరువు గ్రామ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే చిట్టిబాబును సోమవారం మర్యాద పూర్వకంగా కలసి సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ సంక్షేమాలు అందించేలా తమ వంతు కృషి చేయాలన్నారు. గ్రామ శాఖ అధ్యక్షుడు గోగి శ్రీరామమూర్తి, ఉపాధ్యక్షుడు కడలి సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సత్యనారాయణ, కన్వీనర్‌ వాకపల్లి శ్రీనివాసరావు, ఉప కన్వీనర్‌ మల్లాడి రవికుమార్‌లు ఎమ్మెల్యేను కలసిన వారిలో ఉన్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తుడికి రూ.50 వేల సాయం



బాలకృష్ణకు సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

రావులపాలెం: కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న వ్యక్తికి వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వ విప్‌, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. సోమవారం మండలంలోని గోపాలపురంలో ఎమ్మెల్యే స్వగృహం వద్ద జరిగిన కార్యక్రమంలో ఈ సాయాన్ని ఆయన అందజేశారు. కొత్తపేట గ్రామ శివారు చినగూళ్లపాలేనికి చెందిన మామిడిశెట్టి దుర్గాప్రసాద్‌ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. అతని వైద్య ఖర్చుల నిమిత్తం తండ్రి మామిడిశెట్టి బాలకృష్ణకు రూ.50 వేలను ఆర్థిక సాయంగా ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అందజేశారు.

డిగ్రీ కళాశాలలో ఆర్జేడీ తనిఖీలు



అధ్యాపకులకు సూచనలు చేస్తున్న ఆర్జేడీ కృష్ణ

రాజోలు: ప్రభుత్వ డిగ్రీ కళాశాలను రాజమహేంద్రవరం ఆర్జేడీ డాక్టర్‌ సి.కృష్ణ సోమవారం పలు రికార్డులు తనిఖీలు చేశారు. ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ సాయిబాబు ఆధ్వర్యంలో అధ్యాపకులు ఆర్జేడీకి స్వాగతం పలికారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యతో పాటు ప్రభుత్వం అవలంబిస్తున్న ఉపాధి కల్పన అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. కళాశాలకు రాబోయే కాలంలో న్యాక్‌ బృందం విచ్చేస్తుందని దానికి తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. వైస్‌ ప్రిన్సిపాల్‌ టీఎస్వీ పద్మనాభం, అధ్యాపకులు రాజ్‌కుమార్‌, శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రైతు బాంధవుడు కాటన్‌దొర

అంబాజీపేట: మన దేశం కాకపోయిన దుర్భిక్షంతో అల్లాడుతున్న తెలుగు ప్రజలను ఆదుకున్న దైవం సర్‌ ఆర్థర్‌ కాటన్‌ మహాశయుడని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. కాటన్‌ వర్ధంతి సందర్భంగా అంబాజీపేట ఎంపీపీ, తహసీల్దార్‌ కార్యాలయాల ఆవరణలో ఉన్న కాటన్‌ విగ్రహం వద్ద సోమవారం నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.సత్యనారాయణ, తహసీల్దార్‌ టి.మంగతాయారు, వైఎస్సార్‌ వెలుగు ఏపీఎం గంగాధర్‌, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: సర్‌ ఆర్థర్‌ కాటన్‌ చిరస్మరణీయుడని సర్పంచ్‌ గొసు మొహిద్దీన్‌, పీఏసీఎస్‌ చైర్మన్‌ కటకంశెట్టి ఆదిత్యకుమార్‌ శ్లాఘించారు. కాటన్‌ వర్ధంతి సందర్భంగా మామిడికుదురు మండల రెవెన్యూ కార్యాలయం ప్రాంగణంలో ఉన్న విగ్రహానికి ప్రజా ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు నయినాల సీతామహలక్ష్మి, వర్ధినేని రాము, వైఎస్సార్‌ సీపీ నేతలు పాల్గొన్నారు.

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో సర్‌ ఆర్థర్‌ కాటన్‌ వర్ధంతిని రైతు సంఘాల నాయకులు సోమవారం ఘనంగా జరిపారు. స్థానిక సర్పంచ్‌ గుండుమొగుల వెంకటేశ్వరరావు కాటన్‌ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కాటన్‌ మహాశయుని సేవలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు మోటూరి శ్రీరామ సత్యనారాయణమూర్తి, వింటి శ్రీ సాయిరాం, రావూరి వెంకటరత్నం, రావూరి ప్రభాకరరావు ఉన్నారు.

సఖినేటిపల్లి: సర్‌ ఆర్థర్‌ కాటన్‌ వర్ధంతి సందర్భంగా సర్పంచ్‌ గొల్లమందల చిట్టిబాబు స్థానిక లాకుల వద్ద ఆయన నిలువెత్తు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానికులు, ప్రముఖులు, లాకు సిబ్బంది పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిపై చైతన్యం రావాలి

- అవగాహన కోసం ర్యాలీలు
- తగ్గుతున్న కేసుల సంఖ్య



ఇంటింటి సర్వే ద్వారా కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తిస్తున్న ఆరోగ్య కార్యకర్తలు

మామిడికుదురు: కుష్ఠు వ్యాధిపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చే దిశగా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. దీనిలో భాగంగా సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ఈ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గత నెల 26 నుంచి ఈ నెల 25వ తేదీ వరకు కుష్ఠు వ్యాధి నిర్మూలనా పక్షోత్సవాలను నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఆరోగ్య కార్యకర్తలు ప్రతి ఇంటింటికీ తిరిగి కుష్ఠు వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తిస్తున్నారు.

కుష్ఠు వ్యాధి లక్షణాలు

చర్మంపై స్పర్శ లేని మచ్చలు, మందమైన మెరిసే జిడ్డు కలిగిన చర్మం, చర్మం ఉబ్బెత్తుగా బత్తాయి తొక్క మాదిరిగా ఉండడం. చెవులపై, వీపుపై, ఎదపై నొప్పి లేని బొడిపెలు, కనుబొమ్మలు మరియు కనుపెప్పల వెంట్రుకలు రాలిపోవడం, ముక్కు దిబ్బడ, ముక్కులో నుంచి రక్తం కారడం, కాళ్లు చేతులు తిమ్మిర్లు లేక జోములు కలిగి ఉండడం, అరచేతులు, అరికాళ్లలో స్పర్శ కోల్పోవడం, చల్లని లేదా వేడి వస్తువులను గుర్తించలేకపోవడం, చేతుల నుంచి వస్తువులు జారిపోవడం, కాళ్ల చెప్పులు జారిపోవడం, తెలియకుండానే చేతులు, కాళ్లలో బొబ్బలు రావడం, చేతి వేళ్లు, కాలి వేళ్లు వంకర్లు తిరిగి అంగవైకల్యం రావడం, ఈ వ్యాధి బ్యాక్టీరియా వల్ల వ్యాప్తి చెందుతుంది. ఇది అంటువ్యాధి కాదు. ప్రారంభ రోగ నిర్ధారణ, నిర్వహణతో సంక్రమణను నయం చేయవచ్చు. ఇతర వ్యక్తుల ద్వారా సంక్రమించే అవకాశాలు తక్కువ. తల్లి నుంచి పుట్టబోయే బిడ్డకు ఇది వ్యాపించదు. లైంగిక సంపర్కం ద్వారా కూడా వ్యాప్తి చెందదు.

తగ్గుతున్న కేసుల సంఖ్య...

పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు నియోజకవర్గాల పరిధిలో 20 పీహెచ్‌సీలు ఉన్నాయి. వాటి పరిధిలో గతంలో 37 కుష్ఠు వ్యాధి కేసులు నమోదయ్యాయి. ఇటీవల కాలంలో వీటి సంఖ్య గణనీయంగా తగ్గింది. ప్రస్తుతం మూడు నియోజకవర్గాల్లో ఇంత వరకు కొత్తగా పందొమ్మిది కేసులను మాత్రమే గుర్తించామని అధికారులు పేర్కొన్నారు. 1987కు పూర్వం భారీగా కుష్ఠు వ్యాధి కేసులు నమోదయ్యాయి. ఇటీవల వాటి సంఖ్య భారీగా తగ్గడం శుభ పరిణామమని వైద్య ఆరోగ్య శాఖాధికారులు పేర్కొంటున్నారు.

ఆరోగ్య కార్యకర్తలను సంప్రదించాలి



కుష్ఠు వ్యాధి లక్షణాలు ఉన్న వారు ఆరోగ్య కార్యకర్తలను సంప్రదించాలి. కుష్ఠు వ్యాధిపై ప్రతి ఒక్కరిలో చైతన్యం వచ్చిన రోజునే మంచి ఫలితాలు సాధిస్తాం. ఈ వ్యాధి నిర్మూలన పక్షోత్సవాల్లో ఆరోగ్య కార్యకర్తలు సర్వే చేపట్టారు. లక్షణాలు ఉన్న వారిని గుర్తిస్తున్నారు. దీనిపై భయం వీడిన రోజునే దీని బారి నుంచి త్వరగా కోలుకుంటారు.

– టీవీవీ సత్యనారాయణ, సూపర్‌వైజర్‌, నగరం పీహెచ్‌సీ

ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం



కుష్ఠు వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. దీనిపై ప్రతి ఒక్కరిలోనూ అవగాహన రావాలి. ఆరోగ్య కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి కుష్ఠు వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తిస్తున్నారు. వారి వివరాలను నమోదు చేసి ఉన్నతాధికారులకు పంపిస్తాం. కుష్ఠు వ్యాధి బారిన పడిన వారికి అవసరమైన మందులను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది.

– కేజే ప్రశాంత్‌, పీహెచ్‌సీ వైద్యాధికారి, నగరం

కేసులు తగ్గాయి



కుష్ఠు వ్యాధి కేసులు గణనీయంగా తగ్గాయి. 1987కు ముందు జిల్లాలో 1015 కేసులు ఉండేవి. ప్రతి 10 వేల మందిలో 0.26 శాతం కేసులు నమోదయ్యేవి. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. 50 శాతానికి పైబడి కేసులు తగ్గడం శుభపరిణామం. ఇదే స్ఫూర్తితో ముందుకు వెళ్తే త్వరలోనే కుష్ఠు వ్యాధిని సమూలంగా నిర్మూలించగలం. ప్రజల భాగస్వామ్యంతోనే ఇది సాధ్యమవుతుంది.

– కేవీవీ వరలక్ష్మి, జిల్లా పారా మెడికల్‌ ఆఫీసర్‌, అమలాపురం

మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం

- ఎమ్మెల్యే జగ్గిరెడ్డి
- రావులపాలెం–2 గడప గడపకూ..

రావులపాలెం: వైఎస్సార్‌ సీపీ సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు వివరించి, సేవల్లో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్న లక్ష్యంతో ప్రతి గడపకు వస్తున్నామని ప్రభుత్వ విప్‌, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. రావులపాలెంలోని సచివాలయం–2 పరిధిలో సోమవారం ఎమ్మెల్యే పర్యటించారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి, ప్రజలకు వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వంలో చేసిన మంచి ఇది అని ధైర్యంగా చెప్పడానికి, ప్రజలు తామెదుర్కొంటున్న సమస్యలను చెబితే వాటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఇలా ప్రజల ముందుకు వచ్చిన ఏకైక ముఖ్యమంత్రి జగనన్నను మాత్రమే అన్నారు. ఇలా ప్రజల దగ్గరికి జగనన్న వెళ్లడాన్ని దుష్టచతుష్టయం చూసి సహించలేకపోతోందన్నారు. రోజురోజుకీ జగనన్న ప్రజలకు చేరువవుతుంటే వారు నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని, విజ్ఞులైన ప్రజలే అవన్నీ గమనించాలని కోరారు. పేద ప్రజల సంక్షేమానికి నడుం బిగించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మనందరం మళ్లీ గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, సర్పంచ్‌ తాడేపల్లి నాగమణి, ఉప సర్పంచ్‌ గొలుగూరి మునిరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సాకా ప్రసన్నకుమార్‌, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కర్రి వీర్రెడ్డి, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్‌, కార్యదర్శి దుర్గాప్రసాద్‌, వైఎస్సార్‌సీపీ నాయకులు, వార్డు సభ్యులు కార్యకర్తలు, అభిమానులు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయండి

ఆలమూరు: విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్‌ఎఫ్‌ రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఈనెల 25న జరిగే విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐఎస్‌ఎఫ్‌ జిల్లా కన్వీనర్‌ రవికుమార్‌ పిలుపునిచ్చారు. ఆలమూరు సమతా కార్యాలయంలో బంద్‌ పోస్టర్‌ను ఆవిష్కరించారు. బంద్‌కు విద్యాసంస్థల యాజమాన్యాలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి వెంకట్‌, జిల్లా కార్యవర్గం సభ్యులు వై.సాయి, వి.కుమార్‌ పాల్గొన్నారు.

భారీ వర్షంతో రోడ్లు జలమయం



భారీ వర్షంలో గొడుగులు వేసుకుని స్కూల్‌కు వెళుతున్న విద్యార్థులు

అంబాజీపేట: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా సోమవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి అంబాజీపేట మండలంలోని ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. మాచవరం, కె.పెదపూడి, నందంపూడి, ఇసుకపూడి, వ్యాఘ్రేశ్వరం, అంబాజీపేట, గంగలకుర్రు గ్రామాల్లోని కాలనీలు వర్షపు నీటితో మునిగిపోయాయి. వరిచేలు, కొబ్బరి, కోకో, అరటి తోటలు నీట మునిగాయి. మురుగు నీరు బయటకు వెళ్లేందుకు డ్రైనేజీలు ఆక్రమణకు గురవ్వడంతో ఎక్కడి వర్షపు నీరు అక్కడే ఉండిపోయింది.

మామిడికుదురు: మండల వ్యాప్తంగా సోమవారం ఉదయం నుంచి భారీ వర్షం కురుస్తోంది. దీంతో పలు ప్రాంతాల్లో రోడ్లపై ముంపునీరు భారీగా నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 216వ నెంబర్‌ జాతీయ రహదారి నుంచి జెడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లే రోడ్డుపై భారీగా వర్షం నీరు నిలిచిపోయింది. దీంతో పాటు పాశర్లపూడి నుంచి తాటిపాక కూడలి వరకు 216వ నెంబర్‌ జాతీయ రహదారిపై పలు చోట్ల వర్షం నీరు నిలిచిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మామిడికుదురు ఆల్‌క్యాస్ట్‌కాలనీతో పాటు అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం, మొగలికుదురు, గెద్దాడల్లో పలు కాలనీల్లో వర్షం నీరు నిలిచిపోయి ప్రజలు అగచాట్లు పడుతున్నారు.

పి.గన్నవరం: మండలంలో సోమవారం కురిసిన వర్షంతో జనజీవనం స్తంభించింది. జనం ఇళ్లకే పరిమితమయ్యారు. ప్రయాణికులు, పాఠశాలలకు వెళ్లిన విద్యార్థులు తడిసిముద్దయ్యారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న కాలనీలను వర్షం నీరు చుట్టుముట్టింది.

కొత్తపేట: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఎడతెరిపి లేకుండా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం రాత్రి నుంచి వర్షం కురవడంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. ముసురు పట్టి ఓ మోస్తరు నుంచి భారీగా వర్షం పడటంతో ఎక్కడికక్కడ జనజీవనం స్తంభించింది. జనం బయటకు వెళ్లటానికి వీలు లేక ఇళ్లకే పరిమితమయ్యారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచిపోయింది. పల్లపు రోడ్డు నీటితో నిండి పిల్లకాలువలను తలపిస్తున్నాయి.

సమస్యల పరిష్కార వేదికగా సురక్ష



పాశర్లపూడిలంక సురక్షలో సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు



వానపల్లిలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న డేవిడ్‌రాజు, గంగాధరరావు

మామిడికుదురు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. పాశర్లపూడిలంకలో సోమవారం జరిగిన జగనన్న సురక్షలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇక్కడ 2019 మందికి ఎమ్మెల్యే సర్టిఫికెట్లను అందజేశారు. సమస్యల పరిష్కార వేదికగా జగనన్న సురక్ష కార్యక్రమం నిలిచిందన్నారు. 11 రకాల ప్రభుత్వ సేవలను ఉచితంగా అందించిందని చెప్పారు. సర్టిఫికెట్ల కోసం గతంలో ప్రజలు అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. దానికి భిన్నంగా సురక్ష ద్వారా అధికారులే ప్రజల వద్దకు వచ్చి ఉచితంగా సర్టిఫికెట్లు అందిస్తున్నారని ఎమ్మెల్యే చిట్టిబాబు తెలిపారు. బి.దొడ్డవరంలోనూ సురక్ష కార్యక్రమం జరిగింది. ఇక్కడ 260 మందికి సర్టిఫికెట్లు అందించారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్‌లు తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, చెల్లుబోయిన రామశివసుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ చెరుకూరి పార్వతీదేవి, వాసంశెట్టి వెంకటరమణ, జేసీఎస్‌ మండల కన్వీనర్‌ జక్కంపూడి వాసు, వైఎస్సార్‌ సీపీ నేతలు వాకపల్లి వీరాస్వామి, కాండ్రేగుల శ్రీనివాస్‌, కేదారిశెట్టి మల్లి, బాలం రమేష్‌, బద్దే రామకృష్ణ, అధికారులతో పాటు ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

రావులపాలెం: అపరిష్కృతంగా ఉన్న సమస్యలను గ్రామస్థాయిలో పరిష్కరించడానికే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందని ఈ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వక్తలు సూచించారు. సోమవారం మండలంలోని కొమరాజులంక–1,2 గ్రామ సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండు సచివాలయాల పరిధిలో సుమారు 490 మంది ప్రజలు పాల్గొన్నట్టు ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్‌ తెలిపారు. 330 మందికి వివిధ ధ్రువపత్రాలు అందజేశామన్నారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, సర్పంచ్‌ కర్రి గోవిందకృష్ణారెడ్డి రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సాకా ప్రసన్నకుమార్‌, వైఎస్సార్‌ సీపీ నాయకులు కోనాల రాజు, కార్యదర్శి బ్రహ్మాజీ పాల్గొన్నారు.

అయినవిల్లి: మండలంలోని విలస–2 సచివాలయం పరిధిలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు మాట్లాడుతూ సీఎం వైఎస్‌ జగన్‌ పాలనలో పేదలకు సంక్షేమ పథకాలు 100 శాతం అందుతున్నాయన్నారు. మతం, కులం, పార్టీలు తారతమ్యం లేకుండా అందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారు. సర్పంచ్‌ కుసుమ లిల్లీమంగేష్కర్‌ అధ్యక్షతన జరగ్గా ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి పాల్గొన్నారు.

సఖినేటిపల్లి: మండలంలోని శృంగవరప్పాడులో సోమవారం సర్పంచ్‌ రావి నాగ వెంకటలక్ష్మీదేవి అధ్యక్షతన జగనన్న సురక్ష క్యాంపును ఎంపీపీ ప్రారంభించారు. క్యాంపులో ఎంపీడీవో భీమారావు, తహసీల్దార్‌ వై.రామకుమారి ఆధ్వర్యంలో సిద్ధం చేసిన ఆదాయ, నివాస, కుల ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు ఎంపీపీ, సర్పంచ్‌ అందజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కార వేదిక జగనన్న సురక్ష క్యాంపు అన్నారు. ఎంపీటీసీ యెనుముల కొండమ్మ, వ్యవసాయ సలహామండలి చైర్మన్‌ ఇంజేటి శామ్యూల్‌రాజు, డీటీ సీహెచ్‌ భాస్కర్‌, గ్రామ పార్టీ అధ్యక్షుడు మద్దాల భాను, నాయకులు రావి త్రిమూర్తులు, యెనుముల ఆనంద్‌కుమార్‌ పాల్గొన్నారు.

కొత్తపేట: మండలంలోని వానపల్లి సచివాలయం–1 పరిధిలో బుధవారం 'జగనన్న సురక్ష' నిర్వహించారు. తహసీల్దార్‌ జీడీ కిషోర్‌బాబు అధ్యక్షతన జరిగిన సభలో అముడా చైర్మన్‌ డేవిడ్‌రాజు, ఎంపీపీ గంగాధరరావు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం జగన్‌ పరిపాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. అర్హులై ఉండి లబ్ధి పొందని అర్హులందరూ ఈ జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 860 మందికి ఉచితంగా వివిధ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. వానపల్లి పళ్లాలమ్మ దేవస్థానం చైర్మన్‌ కామిశెట్టి అమ్మన్న, డీసీసీబీ పర్సన్‌ బండారు సత్తిరాజు, గ్రామ పార్టీ అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సాకా జానకిరామరాజు, దుప్పలపూడి మాధవరావు పాల్గొన్నారు. అలాగే అవిడి సచివాలయం–2 పరిధిలోనూ సురక్ష నిర్వహించారు. సర్పంచ్‌ రెడ్డి చంటి అధ్యక్షతన జరిగిన సభలో జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 1237 మందికి వివిధ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.మండల పార్టీ కన్వీనర్‌ ముత్యాల వీరభద్రరావు, ఎంపీటీసీలు దూశి సూరిబాబు, నేతల వెంకటలక్ష్మి, కొత్తపేట హెచ్‌డీసీ సభ్యుడు పల్లి దిలీప్‌, ఎంపీడీఓ ఈ.మహేశ్వరరావు పాల్గొన్నారు.

నిలకడగా వరద ఉధృతి



పడవ దాటి చాకలిపాలెం వస్తున్న కనకాయలంక ప్రజలు

పి.గన్నవరం/సఖినేటిపల్లి/రావులపాలెం/అయినవిల్లి: ఎగువ ప్రాంతాల్లో వరద తగ్గుముఖం పట్టినప్పటికీ పి.గన్నవరం మండలంలోని వశిష్ఠ, వైనతేయ నదీపాయల్లో వరద ఉధృతి నిలకడగా కొనసాగుతోంది. మండలంలోని ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలతో పాటు, ఉభయగోదావరి జిల్లాల సరిహద్దులో ఉన్న పెదమల్లంక, ఆనగర్లంక గ్రామాల ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. చాకలిపాలెం శివారు కనకాయలంక కాజ్‌వేపై ఐదడుగుల వరద ప్రవహిస్తుండటంతో ప్రజలు పడవలపై చాకలిపాలెం గ్రామానికి వస్తున్నారు. సఖినేటిపల్లి లాకుల వద్ద నుంచి టేకిశెట్టిపాలెం దిగువ వరకూ గోదావరి పాయకు చేరి ఉన్న లోతట్టు ప్రాంతంల్లో క్రమేపీ వరద పోటెత్తుతోంది. వరదకు తోడు వర్షాలు కురుస్తుండడంతో ప్రజలు భీతిల్లుతున్నారు.

టేకిశెట్టిపాలెం వద్ద ఏటిగట్టు దిగువన నుంచి అప్పనరామునిలంకకు వెళ్లే ప్రధాన మార్గంలోని గోదావరి పాయ (బాడి కాలువ)పై కొత్తగా ఇటీవల ఎత్తులో నిర్మించిన కాజ్‌వేకు ఇరువైపులా తాత్కాలికంగా మట్టితో నిర్మించిన అప్రోచ్‌ రోడ్లు గండ్లు పడి రహదారులపై వరద ప్రవహిస్తోంది. రావులపాలెం మండలంలోని గౌతమి, వశిష్ఠ పాయల్లో వరద నీటి ప్రవాహం స్వల్పంగా పెరిగింది. సోమవారం ఉదయం నుంచి ఏకధాటిగా కురుస్తున్న వర్షాల కారణంగా గోదావరి ప్రవాహం పెరుగుతోంది. అయినవిల్లి మండలంలోని ముక్తేశ్వరం–అయినవిల్లిలంక వెదురుబిడెం వద్ద కాజ్‌వే మరలా మునిగింది. ఈ కాజ్‌వే పై మూడడుగుల మేర వరద ప్రవహిస్తుంది. లంక ప్రాంతా రాకపోకలకు ఇబ్బందులు ఏర్పాడ్డాయి. ముక్తేశ్వరం–అయినవిల్లిలంక వెదురుబిడెం వద్ద కాజ్‌వే వద్ద వరద పరిస్థితిని సోమవారం స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పరిశీలించారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌ సీపీలో చేరికలు



ర్యాలిలో టీడీపీ నుంచి వైఎస్సార్‌ సీపీలో చేరుతున్న వారికి పార్టీ కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, జక్కంపూడి గణేష్‌

ఆత్రేయపురం: రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై ఎంతో మంది సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో నడిచేందుకు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్‌ చిర్ల జగ్గిరెడ్డి, రాష్ట్ర యువజన రీజినల్‌ కోఆర్డినేటర్‌ జక్కంపూడి గణేష్‌ అన్నారు. మండలంలోని ర్యాలి గ్రామం నుంచి సుమారు 100 మంది జెడ్పీటీసీ బోణం సాయిబాబు ఆధ్వర్యంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌ సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే చిర్లజగ్గిరెడ్డి, రాష్ట్ర పార్టీ యువజన రీజినల్‌ కోఆర్డినేటర్‌ జక్కంపూడి గణేష్‌ల సమక్షంలో పార్టీలో చేరారు. జంగా అదిబాబు, సత్తిబాబు, ఈలి రాముడు, వెంకన్న, బూరయ్య, కొండేటి సత్తిబాబు, మెర్ల గోపాలకృష్ణ, మణి,రాసూరి ప్రకాష్‌, సతీష్‌ తదితరులు సుమారు 100 మంది టీడీపీని వీడి వైఎస్సార్‌ సీపీలో చేరగా జగ్గిరెడ్డి, గణేష్‌ పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ ఎస్సీ సెల్‌ చైర్మన్‌ కప్పల శ్రీధర్‌, చల్లా ప్రభాకరరావు, సొసైటీ చైర్మన్‌ పేర్చెర్ల కృష్ణంరాజు, మాజీ ఎంపీటీసీ ఈలి శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వరద పరిస్థితిపై ఎస్‌డీఆర్‌ఎఫ్‌ బృందం సమీక్ష

మామిడికుదురు: భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో తీర గ్రామాల్లోని పరిస్థితిని ఎస్‌డీఆర్‌ఎఫ్‌ బృందం సోమవారం సమీక్షించింది. ఎస్‌డీఆర్‌ఎఫ్‌ ఎస్సై ఎం.లోకేష్‌నాయక్‌ నేతృత్వంలో బృందం సభ్యులు లైఫ్‌ జాకెట్లతో పాటు ఇతర సామగ్రి తీసుకుని మామిడికుదురు మండలానికి చేరుకున్నారు. తహసీల్దార్‌ రియాజ్‌ హుస్సేన్‌తో వరద పరిస్థితిపై చర్చించారు. అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక, పెదపట్నం గ్రామాలతో పాటు పాశర్లపూడి, పాశర్లపూడిలంక గ్రామాల్లో కొంత ప్రాంతం వరదబారిన పడుతుందని రెవెన్యూ అధికారుల బృందం సభ్యులకు వివరించారు. వరద మరింత పెరిగిన పక్షంలో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. భారీ వర్షాలు వరదల నేపథ్యంలో తీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన



మట్టపర్రులో మహిళకు పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే రాపాక

మలికిపురం: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌ పాలన సాగుతోందని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. సోమవారం మట్టపర్రులో జోరు వానలో ఎమ్మెల్యే రాపాక అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో కలసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి సీఎం జగన్‌ పాలనలో ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ ఫలాలు వివరించే బ్రోచర్లను ఎమ్మెల్యే అందజేశారు. పథకాల అమలులో సమస్యలు ఉంటే వలంటీర్లు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని ప్రజలకు సూచించారు. పార్టీ మండల అధ్యక్షుడు ముత్యాల కాశీ, డీసీఎంఎస్‌ డైరెక్టర్‌ అడబాల బ్రహ్మాజీ, ఏఎంసీ చైర్మన్‌ గుబ్బల రోజారమణి, ఎంపీటీసీ నల్లి అంజలిదేవి, గుబ్బల మనోహర్‌, కూనపరెడ్డి రాంబాబు, చింతా రాజబాబు పాల్గొన్నారు.

ఓటర్ల సర్వే సమగ్రంగా చేయాలి

అంబాజీపేట: ప్రభుత్వ ఉద్యోగులతో మాత్రమే ఓటర్ల జాబితా సమగ్ర సర్వే చేయించాలని అఖిల పక్ష పార్టీ నాయకులు కోరారు. అంబాజీపేట తహసీల్దార్‌ టి.మంగతాయారుకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సోమవారం అందజేశారు. పలువురు మాట్లాడుతూ గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నట్లు ముందుగా ప్రజలకు సమాచారం ఇవ్వాలన్నారు. బీఎల్వోలు ప్రతి ఒక్కరినీ సర్వే చేయాలని కోరారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కోలాటం

మామిడికుదురు: మొగలికుదురు గ్రామ పరిధిలోని జగ్గన్నపేట భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయం వద్ద స్థానిక మహిళలు ప్రదర్శించిన కోలాటం విశేషంగా ఆకట్టుకుంది. కోలాటం నృత్యంలో స్థానిక మహిళలు రెండు నెలల నుంచి శిక్షణ పొందుతున్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న సందర్భంగా ఆలయం వద్ద సోమవారం మహిళలు ఆధ్యాత్మిక గీతాలు ఆలపిస్తూ లయబద్ధంగా నృత్యం చేశారు. భారీ సంఖ్యలో విచ్చేసిన భక్తులు కోలాటం నృత్యాన్ని తిలకించి మంత్రముగ్ధులయ్యారు.

చెరువులను కాపాడాలంటూ వినతి

సఖినేటిపల్లి: మండలంలోని కేశవదాసుపాలెంలో ఉపాధి హామీ పథకం నిధులు రూ.9 లక్షలతో తవ్విన రెండు చెరువులను ఆక్వా సాగుదారుల నుంచి కాపాడాలని ప్రజా సంఘాల నాయకులు సోమవారం పరిషత్‌ కార్యాలయంలో అర్జీ అందజేశారు. ఆక్వా సాగుదారులు కొంత మంది కలుషిత నీటికి గండి కొట్టి చెరువుల్లోకి మళ్లించాలన్న ప్రయత్నంలో ఉన్నారన్నారు. ఈ మేరకు మండల పరిషత్‌ ఏవో సీహెచ్‌ సోమేశ్వరీకి అర్జీని అందజేశారు. బూశి జాన్‌ మోషె, నల్లి ప్రసాద్‌, ముత్యాల శ్రీనివాసరావు, చెవ్వాకుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆల్‌క్యాస్ట్‌ కాలనీ సమస్యలు పరిష్కరించాలి

మామిడికుదురు: స్థానిక ఆల్‌క్యాస్ట్‌ కాలనీలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం కాలనీ వాసులు డీటీ శరణ్యకు వినతి పత్రం ఇచ్చారు. 15 ఏళ్ల నుంచి కాలనీలో ఇళ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నామని, కానీ కాలనీలో పట్టాలు పొందిన కొందరు ఇళ్లు నిర్మించుకోకుండా ఖాళీగా వదిలి వేయడం వల్ల ఆ ప్రాంతాల్లో ముంపునీరు నిలిచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ముంపునీరు భారీగా నిలిచిపోయి దోమలు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. కాలనీకి తాగునీరు కూడా సక్రమంగా రావడం లేదన్నారు. ఖాళీ స్థలాలను వేరే లబ్ధిదారులకు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వీటితో పాటు కాలనీలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎంపీటీసీ నయినాల సీతామహాలక్ష్మితో పాటు కాలనీ వాసులు పాల్గొన్నారు.